క్లుప్తంగా

ఘనంగా గంగ జాతర


కొలువుదీరిన అమ్మవారు

చిత్తూరు రూరల్ (కాణిపాకం): చిత్తూరు నగరంలోని ఇరువారంలో మంగళవారం గంగజాతర ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా వీధిలో అమ్మవారిని కొలువుదీర్చి తొలి పూజను భక్తిశ్రద్ధలతో చేపట్టారు. అనంతరం స్థానికులు ఊరేగింపుగా వచ్చి అమ్మవారికి నైవేద్యంగా అంబలి పోశారు. విశేష పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. రాత్రి పిండివంటలను నైవేద్యంగా సమర్పించారు. పుష్పాలంకరణలో అమ్మవారు భక్తులను కనువిందు చేశారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి


వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న డీఎంహెచ్‌ఓ ప్రభావతి దేవి

కాణిపాకం: సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా వ్యవహరించి.. వ్యాధుల కట్టడికి కృషి చేయాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి ప్రభావతి దేవి ఆదేశించారు. చిత్తూరు నగరంలోని తన కార్యాలయంలో మంగళవారం జిల్లాలోని వైద్యాధికారులతో జూమ్ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయన్నారు. ఈ కారణంగా సీజనల్ వ్యాధులు ముంచుకొస్తున్నాయని తెలిపారు. ఇలాంటి తరుణంలో మండల వైద్యాధికారులు అప్రమత్తంగా వ్యవహరించి గ్రామాల్లో పర్యటిస్తూ ఉండాలన్నారు. జ్వరాలు అతిసారం, డెంగీ, మలేరియా, టైఫాయిడ్ వంటి వాటిపై వెంటనే స్పందించి బాధితులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని సూచించారు. గర్భవతులకు సేవలపై దృష్టి సారించాలని పేర్కొన్నారు.

దోమలను నిర్మూలించాలి


మాట్లాడుతున్న సీహెచ్‌ఓ లక్ష్మీనారాయణ

యాదమరి(పూతలపట్టు): దోమల నిర్మూలనతోనే మలేరియా నివారణ సాధ్యమని కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ లక్ష్మీ నారాయణ తెలిపారు. మంగళవారం సంతగేటులోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆశా కార్యకర్తలకు సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంటి దగ్గర నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలని తెలిపారు. కూలర్లు, పాత టైర్లు, ఇతర పనికిరాని వస్తువులలో నీళ్లను పారబోయాలని తెలిపారు. పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని, నిద్రపోతున్నప్పుడు దోమతెరలను వాడాలని సూచించారు. ఆశా వర్కర్ల పరిధిలోని గ్రామాల్లో ప్రజలకు మలేరియా జ్వరంపై అవగాహన కల్పించాలని సూచించారు. నిర్లక్ష్యం వహిస్తే జ్వరాలు విపరీతంగా వ్యాపించడానికి అవకాశాలు ఉంటాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ అనసూయమ్మ, ఎంఎల్‌హెచ్‌పీ లక్ష్మీపతి, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

ప్రత్యక్ష ప్రసారానికి ఏర్పాట్లు

పూతలపట్టు: సీఎంగా చంద్రబాబునాయుడు బుధవారం ప్రమాణ స్వీకారం చేస్తున్న నేపథ్యంలో ఉదయం 9 గంటలకు మండలంలోని ప్రభుత్వ కార్యాలయాల్లో ప్రత్యక్ష ప్రసారం ఏర్పాటు చేశామని తహసీల్దార్ సుబ్రమణ్యంరెడ్డి, ఎంపీడీఓ ప్రసన్నకుమారి ఓ ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ కార్యాలయాల్లో ఏర్పాటు చేసిన ప్రత్యేక్ష ప్రసారాన్ని ప్రజాప్రతినిధులు, మండల ప్రజలు వీక్షించాలని కోరారు. మంగళవారం అన్ని ప్రభుత్వ కార్యాలయాలను విద్యుత్ దీపాలతో అలంకరించామని పేర్కొన్నారు.

ధ్యానముద్రలో వానరం


కాకి బొమ్మపై ధ్యానం చేస్తున్న వానరం

పలమనేరు: పట్టణ సమీపంలోని శనీశ్వరాలయం వద్ద వానరం ధ్యానముద్రలో దర్శనమిచ్చింది. శనీశ్వరుని వాహనమైన కాకి బొమ్మపై వానరం కూర్చొని ధ్యానం చేస్తుండగా ఆలయానికి వెళ్లిన భక్తులు ఆ దృశ్యాన్ని తమ సెల్‌ఫోన్లలో బంధించి మంగళవారం సోషల్ మీడియాలో పెట్టారు. ధ్యానముద్రలో కనిపిస్తున్న ఆ వానరాన్ని చూసిన జనం వైరల్ చేస్తున్నారు.

భూసార పరీక్ష.. పంటకు శ్రీరామరక్ష

చిత్తూరు రూరల్ (కాణిపాకం): వ్యవసాయంలో పెట్టుబడులు తగ్గి,దిగుబడులు పెరగాలంటే భూసార పరీక్షలు తప్ప నిసరి అని వ్యవసాయశాఖ అధికారులు చెబుతు న్నారు. వాస్తవానికి 90 శాతం మంది రైతులు పం టకు కావాల్సిన పోషక విలువలు తమ భూమిలో ఉన్నాయో లేదో తెలుసుకోకుండానే పంటల సాగు చేపడుతున్నారు. అధిక దిగుబడులు రావాలని రసాయనిక ఎరువులను విచ్చలవిడిగా వినియోగి స్తున్నారు. ఫలితంగా ఖర్చు పెరగడం తప్ప దిగుబ డుల్లో మార్పు ఉండటం లేదు. అంతే కాక వేసిన ఎరువుల వల్ల భూమిలో సహజసిద్ధంగా ఉండే పోషకాలు నశించిపోతున్నాయి.

జీపీఎస్ విధానంతో మట్టి సేకరణ

ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వ్యవసాయంలో అమలు చేస్తూ రైతులు మెరుగైన దిగుబడులు సాధించేలా ప్రభుత్వం చర్యలు చేపడుతోంది. అందులో భాగంగానే మోతాదుకు మించి రసాయనిక ఎరువుల వినియోగాన్ని నియంత్రించడంతో పాటు రైతులకు పెట్టుబడి భారం తగ్గించేలా వ్యవసాయ శాఖ అధికారులు ముందుకు పోతున్నారు. భూసార పరీక్షల ఆధారంగా నేలలో ఉన్న పోషకాల ను గుర్తించి పంటల సాగు చేపట్టేలా రైతులను చైతన్య పరుస్తున్నారు. ఇందుకోసం జీపీఎస్ (గ్లోబల్ పొజిషనింగ్ సిస్టం) ద్వారా మట్టి నమూ నాలు సేకరించి, భూసార నిర్వహిస్తున్నారు.

సూక్ష్మ పోషకాలే కీలకం

పంటల సాగులో అధిక దిగుబడులు సాధించాలనే తపనతో మోతాదుకు మించి వాడుతున్న రసాయనిక ఎరువుల వల్లనే భూమిలోని పోషకాలు నశిం చి పోతున్నాయి. పొటాష్ ను ఎక్కువగా వాడడం వల్ల మెగ్నీషియం, జింక్, ఇనుము వంటి సూక్ష్మపోషకాలు మొక్కకు అందకుండా పోతున్నాయి. ఫలి


భూసార పరీక్షలు చేస్తున్న వ్యవసాయ శాఖ అధికారులు, సిబ్బంది

తంగా జింకు లోపంతో మొక్క ఎదుగుదల తగ్గి దిగుబడులపై ప్రభావం చూపుతోంది. సూక్ష్మ, స్థూల పోషకాలతో పాటు హైడ్రోజన్, సేంద్రియ కర్బనాల స్థాయి కూడా చాలా కీలకం. సేంద్రియ కర్బనం లోపిస్తే భూమి తన సహజ స్వభావాన్ని కోల్పోతుంది. ఎంత ఎరువు వేసినా భూమి గ్రహించకుండా నిస్సారమైపోతుంది. భూమిలో సేంద్రియ కర్బనం 0.5 శాతం నుంచి 0.75 శాతం వరకు ఉంటే సాధారణంగా పరిగణిస్తారు. చాలా చోట్ల భూమిలో ఇది 0.1 శాతం నుంచి 0.20 శాతం వరకు ఉన్నట్లు గత పరీక్షల ద్వారా తెలుస్తోంది.

మూడేళ్లకోసారి తప్పనిసరి

పొలంలో సేకరించిన మట్టిని ప్రయోగశాలల్లో భౌతిక, రసాయనిక పద్ధతుల్లో విశ్లేషించి, నేల స్వభా వం, లక్షణాలు, పోషక విలువల స్థాయి గుర్తిస్తారు. ఈ ఫలితాల ఆధారంగా ఏ పంటకు ఎంత మోతాదులో పోషకాలు అవసరమో తెలుస్తోంది. దీంతో దిగుబడి సాధించే అవకాశం ఉంటుంది. భూమిలో లోపించిన లవణాలను గుర్తించి, దానికి అనుగుణంగా ఎరువులను వేసుకోవడం వలన పెట్టుబడి ఖర్చు తగ్గుతుంది. ప్రతి మూడేళ్లకు ఒక సారి భూసార పరీక్షలు చేయించడం మంచిదని వ్యవసాయ శాస్త్రవేత్తలు సూచిస్తున్నారు.

మట్టి సేకరణలో జాగ్రత్తలు

- పొలంలో ఎరువులు వేసిన తర్వాత నెల రోజుల వరకు, నీరు పెట్టిన తర్వాత నీడ పడే ప్రదేశాలు, ఎరువులు కుప్పలు, గట్లు, చెట్ల వద్ద మట్టి నమూనాలు తీయరాదు.
- పంటకోత తర్వాత, వేసవిలో పంటలు లేని సమయాల్లో మట్టి నమూనాలు సేకరించాలి.
- పొలంలో త్రిభుజాకారంలో 15–20 సెంటీమీటర్ల లోతున పారతో గుంత తీసి అందులో పై పొర నుంచి కింద వరకు ఒక పక్కగా మట్టిని సేకరించాలి.
- పొలం మొత్తంగా 8–10 చోట్ల సేకరించిన మట్టిని ఒక చోట చేర్చి బాగా కలిపి నాలుగు భాగాలుగా చేయాలి. అందులో ఎదుటి భాగాలు మాత్రమే తీసుకోవాలి. ఈ విధంగా మట్టి అర కిలో వచ్చే వరకు చేస్తూ ఉండాలి.
- సేకరించిన మట్టిలో రాళ్లు, గడ్డి వేర్లను వేరు చేసి నీడలో ఆరబెట్టాలి.
- మట్టి బాగా ఆరిన తర్వాత ప్లాస్టిక్ బ్యాగ్ లో గాని పాలిథిన్ కవర్లోగాని నింపి రైతు వివరాలు రాసి భూసార పరీక్ష కేంద్రాలకు పంపాలి. మట్టి సేకరణకు స్థానిక ఎంపీఈఓల సాయం తీసు కుంటే, వారు రైతు పొలం వద్ద జీపీఎస్ నమోదు చేసి నమూనాలను సేకరించి పంపుతారు.

అవగాహన కల్పిస్తున్నాం

భూసార పరీక్షల ఆధారంగా పంటలు సాగు చేస్తే అధిక దిగుబడులు ఉంటాయి. ఏటా భూసార పరీక్షలు చేసి మండలంలో రైతులకు కార్డులు అందజేస్తున్నాం. ఈ ఏడాది కూడా భూసార పరీక్షలపై రైతులకు అవగాహన కల్పిస్తున్నాం. రసాయనిక ఎరువులు అధికంగా వాడడం వల్ల భూమిలో సారం తగ్గి పంట దిగుబడి తగ్గిపోతుంది.

– వేణు, ఏఓ, వ్యవసాయశాఖ, చిత్తూరు మండలం

దండుమారెమ్మకు ప్రత్యేక పూజలు


తగ్గువారిపల్లెలో దండుమారెమ్మ

బంగారుపాళెం: మండలంలోని తగ్గువారిపల్లెలో దండుమారెమ్మ ఆలయంలో మంగళవారం అమ్మవారికి ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించారు. గంగమ్మ జాతర కార్యక్రమంలో భాగంగా ఉదయం అంబళ్లు, సాయంత్రం పొంగళ్లను నైవేద్యంగా సమర్పించారు. ఈ సందర్భంగా ఆలయంలో అమ్మవారి మూల విగ్రహానికి ప్రత్యేక పూజలు చేపట్టారు. అనంతరం అమ్మవారిని విశేషంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. పెద్ద సంఖ్యలో గ్రామస్తులు అమ్మవారికి పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు.

బంగారుపాళెం దళితవాడలో..

బంగారుపాళెం దళితవాడలో మంగళవారం గంగమ్మ జాతర సందర్భంగా ఉదయం అంబళ్లు, సాయంత్రం పొంగళ్లు సమర్పించారు. రాత్రికి అమ్మవారి శిరమాను గ్రామ వీధుల్లో ఊరేగించి నడివీధిలో ఏర్పాటు చేసిన మండలపంలో కొలువుదీర్చనున్నారు.

ఈఏపీ సెట్‌లో నగర విద్యార్థుల ప్రతిభ


చరిత్


సీమ


సౌమ్య


తరుణ్‌కుమార్


భవ్య

చిత్తూరు కలెక్టరేట్ : నగరంలోని పలు విద్యాసంస్థల్లో చదివిన విద్యార్థులు ఈఏపీ సెట్‌లో ప్రతిభ చాటారు. ఉత్తమ ర్యాంకులు సాధించి శభాష్ అనిపించుకున్నారు. అత్యుత్తమ ర్యాంకులు సాధించిన విద్యార్థులను ఆయా కళాశాలల చైర్మన్‌లు, ప్రిన్సిపల్స్ అభినందించారు. నగరంలోని మురగానపల్లిలో ఉన్న పీఎస్ఎన్ వివేకానంద జూనియర్ కళాశాలలో చదివిన చరిత్ 2,272, సీమ 2,967, చందన 3,123, నేహిత్ 3,205, ప్రీతి 4,387, దినేష్ కార్తిక్ 5,045, పవన్ 5,369 ర్యాంకులు సాధించారని ఆ కళాశాల కరస్పాండెంట్ సత్యనారాయణ, ప్రిన్సిపల్ నాగరాజశెట్టి వెల్లడించారు. కళాశాలలో మొత్తం 20 మంది విద్యార్థులు ఉత్తమ ర్యాంకులు సాధించారన్నారు. గాంధీరోడ్డులో ఉన్న శ్రీ చైతన్య కళాశాలలో వర్షిత 1,465, గురుపవన్‌కుమార్ 1,508, తసీన్ 2,133, ముకేష్ 5,263, విద్య 5,370 ర్యాంకులు సాధించారని ప్రిన్సిపల్ శివకుమార్ తెలిపారు. కొత్తబస్టాండ్ వద్ద ఉన్న విజయం కళాశాలలో సౌమ్య 10,781, లీనా 10,900, సుకేష్ 11,000 ర్యాంకులు సాధించారని ఆ కళాశాల చైర్మన్ తేజోమూర్తి తెలిపారు. వీరితో పాటు 26 మంది విద్యార్థులకు 20 వేల లోపు ర్యాంకులు వచ్చాయని వెల్లడించారు. మురగానపల్లిలో ఉన్న వివేకానంద(వీఎంకే) కళాశాలలో తరుణ్ కుమార్ 2,756, భవ్య 6,082, వీరితో పాటు 10 వేల లోపు ర్యాంకులు పలువురు విద్యార్థులు సాధించారని కరస్పాండెంట్‌లు మహేంద్రకుమార్, భాస్కరనాయుడు తెలిపారు.


ఉత్తమ ర్యాంకులు సాధించిన విద్యార్థులను అభినందిస్తున్న శ్రీ చైతన్య ప్రిన్సిపల్, అధ్యాపకులు

కొండెక్కిన కూరగాయల ధరలు

- పచ్చిమిర్చి కిలో రూ.120
- బీరకాయ కిలో రూ.80
- బీన్స్ కిలో రూ. 100
- అన్ని రకాల ధరలు పెరుగుదల
- సామాన్యుడు కొనడం కష్టమే


వీఎస్.అగ్రహారంలో కూరగాయల దుకాణం

ఐరాల: కూరగాయల ధరలు మండిపోతున్నాయి. సాధారణంగా వేసవిలో టమాటాల ధర మాత్రమే పెరగడం చూస్తుంటాం. కానీ ప్రస్తుతం అన్ని రకాల కూరగాయల ధరలు ఆకాశాన్ని అంటడంతో సామాన్య ప్రజలు వాటిని కొనలేని పరిస్థితిలో ఉన్నారు. రోజురోజుకూ ధరలు పెరిగిపోతూ ఉండడంతో ప్రజలు బెంబేలెత్తిపోతున్నారు. కూరగాయల ధరలు పెరిగిపోవడంతో సామాన్యులకు భారంగా మారింది. వీటిని కొనలేం తినలేం అన్న పరిస్థితి నెలకొంది. రెండు వారాల క్రితానికి, ఇప్పటికి కూరగాయలు రెట్టింపు ధరలు పెరిగాయని సామాన్యులు వాపోతున్నారు. రెండు వారాల క్రితం వరకు టమాటా కిలో రూ.20 ఉండగా ప్రస్తుతం రూ.60కు చేరింది. మిర్చి కిలో రూ.40 ఉండగా ప్రస్తుతం రూ.120కు పెరిగింది. బెండ కిలో రూ.40 ఉండగా ప్రస్తుతం కిలో రూ.80 పెరిగింది. బీన్స్ కిలో రూ.50 ఉండగా ప్రస్తుతం కిలో రూ.100కు పెరిగింది. చిక్కుడు కిలో.40 ఉండగా రూ.80, బీరకాయ కిలో రూ.40 ఉండగా రూ.80 కు పెరిగింది. రెండు వారాల వ్యవధిలోనే కిలోకు రెట్టింపు ధరలు తీసుకుంటున్నారు. వేసవిలో కూరగాయల దిగుబడి సరిగా లేకపోవడంతో కూరగాయల కొరత ఏర్పడింది. దీంతో వ్యాపారస్తులు అధిక ధరలు పెట్టి కూరగాయలను కొనుగోలు చేసి దుకాణాల వద్ద అధిక ధరలకు విక్రయిస్తున్న పరిస్థితి ఏర్పడింది.

నేత్రపర్వం.. గరుడోత్సవం

యాదమరి(పూతలపట్టు): వార్షిక బ్రహ్మోత్సవాలను పురస్కరించుకొని ఇంద్రపురి వరదరాజులస్వామి గరుడోత్సవం నేత్రపర్వంగా సాగింది. ఉదయం మూలస్థానంలో వెలసిన శ్రీదేవి, భూదేవి సమేత ఇంద్రవరదుడికి సుగంధద్రవ్యాలతో అభిషేకం చేశారు. ప్రత్యేకంగా అలకరించి విశేష పూజలు చేశారు. అనంతరం భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. ఉదయం 9 గంటలకు స్వామివారు గరుడ సేవలో ఊరేగారు. ఊరేగింపుగా వస్తున్న స్వామివారికి భక్తులు నీరాజనాలు పట్టి మొక్కులు చెల్లించుకున్నారు. రాత్రి కల్పవృక్ష సేవలో స్వామివారు భక్తులు దర్శనమిచ్చారు. ఈ కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు. బుధవారం ఉదయం హనుమంతవాహనం, రాత్రి గజవాహనం, అలాగే కల్యాణోత్సవం నిర్వహిస్తున్నట్టు నిర్వాహకులు పేర్కొన్నారు.


గరుడ వాహనంపై ఊరేగుతున్న స్వామివారు


ఇంద్రవరద స్వామి గరుడోత్సవానికి హాజరైన భక్త జనసందోహం

వినాయకుడి సేవలో ఆలయ పునర్నిర్మాణ దాతలు


స్వామివారి సేవలో ఆలయ పునర్నిర్మాణ దాతలు

కాణిపాకం: శ్రీ వరసిద్ధి వినాయక స్వామిని మంగళవారం ఆలయ పునర్నిర్మాణ దాతలు దర్శించుకున్నారు. దాతలు ఐకా రవి, గుత్తికొండ శ్రీనివాస్, గొట్టిపాటి రామకష్ణ ప్రసాద్ కుటుంబ సమేతంగా స్వామివారిని దర్శించుకున్నారు. దాత కుటుంబ సభ్యులకు ఆలయ మాజీ చైర్మన్ మోహన్ రెడ్డి, ఈఓ వెంకటేశు స్వామివారి దర్శన భాగ్యం కల్పించి, తీర్థప్రసాదాలు అందజేశారు.

తిమ్మసముద్రంలో గంగ జాతర


తిమ్మసముద్రంలో కొలువుదీరిన అమ్మవారు

చిత్తూరు రూరల్(కాణిపాకం): చిత్తూరు నగరంలోని తిమ్మసముద్రంలో మంగళవారం గంగ జాతరను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఉదయం తొలిపూజ చేసి జాతర మహోత్సవాన్ని ప్రారంభించారు. అంబలి పోసి అమ్మవారికి ఇష్టమైన పదార్థాలను నైవేద్యంగా సమర్పించారు. రాత్రి వీధి నాటకం ప్రదర్శించారు. బుధవారం సాయంత్రం అమ్మవారిని నిమజ్జనానికి తరలిస్తున్నట్లు జాతర పెద్దలు తెలిపారు.

దరఖాస్తుల ఆహ్వానం

శాంతిపురం: మండలంలోని తులసినాయనపల్లె వద్ద ఉన్న ఏపీ మోడల్ స్కూల్లో ఖాళీగా ఉన్న సీట్ల భర్తీకి ప్రభుత్వం నోటిఫికేషన్ విడుదల చేసిందని ప్రిన్సిపల్ ఎం.డి.కె.వి లత మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 7వ తరగతిలో 6 సీట్లు, 8వ తరగతిలో 5, 9వ తరగతిలో ఒక్క సీటు ఖాళీగా ఉన్నట్లు వివరించారు. ఆసక్తి, అర్హత ఉన్నవారు ఈ నెల 15వ తేదీ లోపు దరఖాస్తు చేసుకుంటే రిజర్వేషన్ల ఆధారంగా సీట్ల భర్తీ ఉంటుందన్నారు. మరిన్ని వివరాలకు తమ కార్యాలయంలో సంప్రదించాలని కోరారు.

ఏఎంసీ చైర్మన్ కోసం పోటీ

పలమనేరు: నియోజకవర్గంలో ఎమ్మెల్యే తర్వాత ప్రొటోకాల్ ఉన్న పోస్టు అగ్రికల్చ్ మార్కెట్ కమిటీ చైర్మన్ పదవికి పలువురు పోటీపడుతున్నారు. ఏఎంసీ చైర్మన్‌కు అన్ని మండలాల్లో ప్రభుత్వ కార్యక్రమాలు, పార్టీ వ్యవహారాల్లో సముచిత స్థానం ఉంటుంది. దీంతో తాజాగా అధికారంలోకి వచ్చిన టీడీపీ నియోజకవర్గ నాయకుల కన్ను దీనిపై పడింది. త్వరలో ఈ నియామకం జరగనున్న నేపథ్యంలో నేతలు ప్రయత్నాలు మొదలుపెట్టారు. ఇప్పటి వరకూ ఇక్కడ ఏఎంసీ చైర్మన్‌గా ఉన్న హేమంత్‌కుమార్ రెడ్డి ఇటీవల రాజీనామా చేసిన విషయం తెలిసిందే. దీంతో అధికార పార్టీ ఈ పోస్టును భర్తీ చేయనుంది. ఇప్పటికే ఈ పోస్టుపై పెద్దపంజాణికి చెందిన ఓ టమాటా వ్యాపారి, బైరెడ్డిపల్లెకి చెందిన సీనియర్ నేత, గంగవరానికి చెందిన ఆ పార్టీ మాజీ జెడ్పీటీసీ, పలమనేరు రూరల్ మండలానికి చెందిన ఇద్దరు బరిలో ఉన్నట్టు సమాచారం.

ఫ్యామిలీ డాక్టర్‌తో ఇంటివద్దే మెరుగైన వైద్యం

గుడిపాల: ఫ్యామిలీ డాక్టర్ సేవలను ప్రజలు వినియోగించుకోవాలని బొమ్మసముద్రం డాక్టర్ అనూష అన్నారు. మండలంలోని 197 రామాపురంలో మంగళవారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. వివిధ రకాల వైద్య పరీక్షలు చేసి అవసరమైన వారికి ఉచితంగా మందులను అందజేశారు. అనంతరం ఇంటివద్ద మంచాన పడ్డ రోగుల వద్దకు వెళ్లి వారికి కావాల్సిన వైద్యసేవలను అందజేశారు. గర్భిణులు, బాలింతలకు వైద్యసేవలు అందించి పౌష్టికాహారం తీసుకోవాలని వారికి సూచించారు. కార్యక్రమంలో వైద్యసిబ్బంది దివ్య, సరస్వతి, శశి, అనురాధ, అశ్విని పాల్గొన్నారు.

ఐరాలలో..

ఐరాల: ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంతో మారుమూల ప్రాంతాల్లోని ప్రజలకు ఇంటి వద్దే మెరుగైన వైద్యసేవలు అందిస్తున్నామని స్థానిక పీహెచ్‌సీ డాక్టర్ పూర్ణలత అన్నారు. మండంలోని పాలకల–2లో మంగళవారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. 104 వాహనంలో 60 మందికి వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. గర్భిణులు, బాలింతలు, వృద్ధులు, బీపీ, షుగర్ వ్యాధిగ్రస్తులకు పరీక్షలు నిర్వహించారు. దీర్ఘకాలిక, ఆరోగ్యశ్రీ పథకం ద్వారా చికిత్సలు చేసుకున్న రోగుల ఇళ్ల వద్దకే వెళ్లి ఆరోగ్య పరిస్థితులు తెలుసుకుని మందులు అందజేశారు. సూచనలు, సలహాలు ఇచ్చారు. కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ సుధాకర్, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.


గుడిపాల: వైద్యసేవలు అందిస్తున్న డాక్టర్ అనూష


ఐరాల: వృద్ధులకు వైద్య పరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది